www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 4 ఆగస్టు 2024

గిరిజన యువతకు ప్రత్యేక శిక్షణ

ఏలూరు :ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ పరిధిలోని ఐదు మండలాల్లో బిఇడి, డిఇడి, టెట్ పాసై ఉపాధ్యాయ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న గిరిజన యువతకు ఉపాధ్యాయ ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు కోటరామచంద్రాపురం ఐటిడిఎ పిఒ జి.శ్రీనుకుమార్ చెప్పారు. స్థానిక ఐటిడిఎ పిఒ వారి ఛాంబర్‌లో ఆయన మాట్లాడుతూ డిగ్రీతో పాటు బిఇడి, ఇంటర్‌తో పాటు డిఇడి టెట్ పాసై ఉపాధ్యాయ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న గిరిజన యువతకు కోటరామచంద్రాపురంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళలకు 33.1/3 శాతం రిజర్వేషన్ సదుపాయం కలదని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల పదో తేదీ లోగా దరఖాస్తులు అందించాలన్నారు. స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం ఫైనల్ మెరిట్ లిస్టు ఆగస్టు 14వ తేదీన ఐటిడిఎ కార్యాలయాపు నోటీస్ బోర్డులో పొందుపరుస్తామని చెప్పారు. వివరాలకు 9603994333, 9490285277 సంప్రదించాలని తెలిపారు.

వేధింపులు.. తొలగింపులు..!

స్కీంవర్కర్లపై కొనసాగుతున్న దారుణకాండ

ప్రభుత్వ పెద్దల ఆలోచనలకు భిన్నంగా క్షేత్రస్థాయిలో పరిస్థితి

అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన, విఒఎలు, ఆర్‌పి, పంచాయతీల్లో పనిచేసే స్కీం ఉద్యోగులే టార్గెట్

ఏళ్ల తరబడి పనిచేస్తున్న స్కీం ఉద్యోగులను అన్యాయంగా తొలగింపు

ఏలూరు జిల్లాలో ఇప్పటి వరకూ 70 మందికిపైగా ఉద్యోగులపై వేటు

'పశ్చిమ'లోనూ కొనసాగుతున్న బెదిరింపుల పర్వం

నాయకుల కక్షపూరిత చర్యలకు వంతపాడుతున్న అధికారులు

రేపు కలెక్టరేట్ల వద్ద స్కీం వర్కర్ల ఆందోళన బాట

'గత ప్రభుత్వానికి భిన్నంగా తమ పాలన ఉంటుంది. ఉద్యోగులపై వేధింపులు, కక్ష్యపూరిత ధోరణలు ఉండవు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం. ఎంఎల్‌ఎలు, స్థానిక నాయకులు సైతం అదేవిధంగా నడుచుకోవాలంటూ సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ తమ సమావేశాల్లో పదేపదే చెబుతున్నారు. ప్రభుత్వ పెద్దల మాటలు లక్ష్యపెట్టకుండా క్షేత్రస్థాయిలో స్థానిక నాయకులు మాత్రం చిరుద్యోగులపై వేధింపుల పర్వం కొనసాగిస్తూ ఏళ్ల తరబడి పనిచేస్తున్న చిరుద్యోగులను నిర్ధాక్షణ్యంగా తొలగిస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. నాయకుల కక్షపూరిత చర్యలకు అధికారులు వంత పాడుతుండడంతో ఎంతోమంది చిరుద్యోగులు బలిపశువులుగా మారుతున్న పరిస్థితి. ఏలూరు జిల్లాలో ఇప్పటికే పదుల సంఖ్యలో స్కీం వర్కర్లు తమ ఉద్యోగాలను కోల్పోగా, పశ్చిమలోనే బెదిరింపుల పర్వం కొనసాగుతోంది. దీంతో స్కీం వర్కర్లపై వేధింపులు ఆపాలని, ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని సోమవారం కలెక్టరేట్ల వద్ద చిరుద్యోగులంతా ఆందోళనకు సిద్ధమైన పరిస్థితి నెలకొంది.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వాలు మారినప్పుడల్లా చిరుద్యోగులైన స్కీం వర్కర్లపై స్థానిక రాజకీయ నాయకులు వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణంగా మారుతోంది. ఏళ్ల తరబడి పనిచేస్తూ వచ్చే కొద్దిపాటి జీతంతోనే ఇల్లు నెట్టుకొస్తున్న కుటుంబాలకు తీరని వేదనను మిగిలిస్తున్న పరిస్థితి నెలకొంది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ప్రభుత్వ పెద్దల ఆలోచనలకు భిన్నంగా క్షేత్రస్థాయిలో పరిస్థితి కొనసాగుతోంది. స్కీం వర్కర్లుగా పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్‌వాడీ ఉద్యోగులు, ఐకెపిలో పనిచేసే విఒఎలు, మెప్మాలోని ఆర్‌పిలు, పంచాయతీ కార్మికులు వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అనేక మంది చిరుద్యోగులపై వైసిపి ముద్రవేసి ఉద్యోగాల నుంచి తొలగిస్తున్న తీరు అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. స్థానిక నాయకులకు, అధికారులకు కొమ్ముకాస్తుండడంతో ఈ పరిస్థితి అత్యంత దారుణంగా కొనసాగుతోంది. ఏలూరు జిల్లాలో పరిస్థితి అత్యంత దారుణంగా ఉండడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పెదవేగి మండలంతోపాటు, ద్వారకాతిరుమల, దెందులూరు, లింగపాలెం, కుక్కునూరు, ఉంగుటూరు, ఏలూరు పట్టణం, జంగారెడ్డిగూడెం వంటి అనేక మండలాల్లో అంగన్‌వాడీ, విఒఎలు, ఆర్‌పిలు, మధ్యాహ్న భోజన, పంచాయతీ కార్మికులుగా పనిచేస్తున్న చిరుద్యోగులను గడిచిన రెండు నెలల కాలంలోనే 70 మందికిపైగా తొలగించినట్లు తెలుస్తోంది. ఇంకా అనేకమందిపై వేధింపుల పర్వం కొనసాగుతోంది. పశ్చిమగోదావరి జిల్లాలోని పోడూరు, పెనుగొండ, భీమవరం, ఉండి వంటి పలు మండలాల్లో పనిచేస్తున్న స్కీంవర్కర్లపై వేధింపులు కొనసాగుతున్న పరిస్థితి నెలకొంది. నాయకుల కక్షసాధింపులతో ఎన్నో కుటుంబాలు ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతున్న పరిస్థితి. ఎన్నికల్లో తమకు అనుకూలంగా చేయాలేదంటూ ఆరోపణలు మోపుతూ వేధింపులకు పాల్పడుతున్నారంటూ స్కీం వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలంటూ స్కీం వర్కర్లు ఆందోళన బాట పట్టేందుకు సిద్ధమయ్యారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కాకముందే ఇటువంటి పరిస్థితి రావడం సర్వత్రా చర్చ చర్చనీయాశంగా మారింది.

నాయకుల దౌర్జన్యాలకు కొమ్ముకాస్తున్న అధికారులు

స్కీం వర్కర్ల తొలగింపులపై అధికారులు వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. స్కీం వర్కర్లుగా పనిచేస్తున్న వారిపై నాయకులు వచ్చి అధికారులకు ఏదైనా చెబితే ఉద్యోగి నిబద్ధత పరిస్థితిని వివరించకుండా అధికారులు కొమ్ముకాస్తున్నారని తెలిసింది. ముందుగా మీరు సదరు ఉద్యోగిపై ఫిర్యాదు చేయాలని, తర్వాత తాము చర్యలు తీసుకుంటామంటూ నాయకులకు అధికారులే సలహాలిస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయ నాయకుల నుంచి ఫిర్యాదులు తీసుకుని తనిఖీల పేరుతో హడావుడీ మెమోలు జారీచేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. సదరు ఉద్యోగి బాగా పనిచేస్తారని గానీ, పనిలో ఎటువంటి ఇబ్బందులు లేవని గానీ నాయకులకు చెప్పడం లేదు. దీంతో స్కీం వర్కర్లపై వేధింపులు యథేచ్ఛగా సాగుతున్న పరిస్థితి నెలకొంది.

గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో పేదల గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి గహ నిర్మాణ శాఖాధికారులను ఆదేశించారు. జిల్లాలో పేదల గృహ నిర్మాణ పనులపై కలెక్టరేట్ నుంచి మండల స్థాయి గృహ నిర్మాణ శాఖ సిబ్బందితో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రి సెల్వి మాట్లాడుతూ జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పట్టణ, గ్రామీణ పథకాల కింద లక్షా 3 వేల 264 ఇళ్లను పేదలకు మంజూరు చేసినట్లు తెలిపారు. వాటిలో 36,480 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. 45,703 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఇంకా 21,806 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించాల్సి ఉందని తెలిపారు. పేదల గృహ నిర్మాణ పనుల ప్రగతిపై రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతిస్తున్న దృష్ట్యా, వీటి నిర్మాణ పనులు వేగవంతం చేసి, వంద రోజుల్లో లక్ష్యాలను పూర్తిచేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించామన్నారు. జిల్లాలో వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణ పనులను జిల్లా వ్యాప్తంగా రోజుకు 337 ఇళ్లకు సంబంధించి ప్రస్తుతం ఉన్న దశ నుండి తదుపరి దశకు తీసుకువెళ్లాలని తెలిపారు. అదేవిధంగా రోజుకు 41 ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసేలా మండలాల వారీగా లక్ష్యాలను నిర్ణయించడం జరిగిందన్నారు. మండల స్థాయి గృహ నిర్మాణ శాఖల అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది వారికి కేటాయించిన లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాల్సిందేనన్నారు. ఇళ్ల నిర్మాణ ప్రగతిని తాను ప్రతిరోజూ సమీక్షిస్తానని, లక్ష్య సాధనలో వెనుకబడిన అధికారులు, సిబ్బందిపై చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు అధికారి సిహెచ్.శ్రీనివాసరావు, ఇఇలు జి.రామకృష్ణ, డి.రమాకాంత్, ప్రభృతులు పాల్గొన్నారు.

టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి



ఎంఎల్‌ఎకు సమస్యను వివరిస్తున్న దొంతవరం రైతులు

పందికోడు కాలువ ఆక్రమణ వల్లే పొలాలు మునక

ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయం వద్ద రైతుల ఆందోళన

సమస్యను పరిష్కరిస్తామని ఎంఎల్‌ఎ ధర్మారాజు హామీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

పందికోడు మురుగు కాలువ ఆక్రమణల వల్లే దొంతవరంలో వందలాది ఎకరాల్లో వరి పొలాలు నేటికీ ముంపులోనే ఉన్నాయని ఆ గ్రామ రైతులు ఎంఎల్‌ఎ ధర్మరాజు క్యాంపు కార్యాలయం వద్ద శనివారం రాత్రి ఆందోళన వ్యక్తం చేశారు. రాచూరు - రావులపర్రు మధ్య పంట కాలువపై పత్తేపురానికి చెందిన చేపల రైతు అక్రమంగా తూరలు పెట్టారని, దీంతో మురుగునీరు కిందకు వెళ్లక వెనక్కి తన్ని తమ పొలాలు మునిగిపోయాయని ఎంఎల్‌ఎ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎంఎల్‌ఎ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి, మురుగునీరు కిందకు వెళ్లేలా ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు.

భార్యల కోసం.. భర్తల పోరుబాట

కలెక్టరేట్ వద్ద రిలేనిరాహార దీక్షలకు దిగిన భర్తలు - మావయ్యే మా కాపురాల్లో చిచ్చుపెడుతున్నారంటూ ఆరోపణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తమ భార్యలను కాపురానికి పంపించాలంటూ సొంత మావయ్యపై ఇద్దరు అల్లుళ్లు పోరుబాటకు దిగిన ఘటన ఏలూరులో చోటుచేసుకుంది. తమ భార్యలను తమ వద్దకు పంపించాలంటూ ఏకంగా జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన చేయడమే కాకుండా, నిరవధిక దీక్షలకు దిగడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పెళ్లిళ్లు అయ్యాక కూడా ఇద్దరు కూతుళ్లను కాపురానికి పంపకుండా తిరిగి అల్లుళ్లపై కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్న తమ మావయ్య బికె.శ్రీనివాస రామానుజ అయ్యంగార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఇద్దరు అల్లుళ్లు శనివారం ఉదయం కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షకు దిగారు. పెద్ద అల్లుడు వంగిపురం పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. 2015 ఫిబ్రవరి 11వ తేదీన అయ్యంగార్ పెద్ద కుమార్తెను వివాహం చేసుకున్నానని, అప్పటి నుంచి తరచూ తన భార్యను మావయ్య అయ్యంగార్ ఇంటికి పిలిపించుకొని కొన్ని రోజుల తర్వాత మళ్లీ పంపించే వారని తెలిపారు. అలాగే 2020 ఫిబ్రవరిలో ఇంటికి పిలిపించుకుని తిరిగి ఇప్పటివరకూ కాపురానికి పంపలేదని తెలిపారు. తన కుమార్తెను కూడా చూడనివ్వడంలేదని ఆవేదన చెందారు. రెండో అల్లుడు పిబి.శేషసాయి మాట్లాడుతూ తాను అయ్యంగార్ రెండో కుమార్తెను 2024 ఫిబ్రవరి 18వ తేదీన వివాహం చేసుకున్నానని, మేలో తన భార్యను ఇంటికి తీసుకెళ్లిన అయ్యంగార్ ఇప్పటివరకూ కాపురానికి పంపలేదని తెలిపారు. కనీసం తమ భార్యలతో మాట్లాడడానికి గానీ, చూడడానికి గానీ, కలవడానికి గానీ తమ మావయ్య అంగీకరించడం లేదని, పైగా తమపై అక్రమ కేసులు పెట్టి బెదిరిస్తున్నారని తెలిపారు. కనీసం చర్చలకు కూడా రావడం లేదని, అయ్యంగార్‌కు ముందు నుంచి అనేకమందిపై అక్రమ కేసులు పెట్టి బెదిరించే అలవాటు ఉందని, ఈ విషయంలో ఒకసారి హైకోర్టు కూడా మొట్టికాయలు వేసిందని తెలిపారు. అధికారులు విచారణ చేసి తమ భార్యలను కాపురానికి పంపించేలా చర్యలు తీసుకోవాలని, తమపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు.

కలెక్టరేట్ వద్ద నిరవధిక దీక్ష చేస్తున్న పవన్, శేషసాయి

సీం వర్కర్లపై వేధింపులు ఆపాలి

5న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్కీం వర్కర్లు, చిరుద్యోగులపై కొత్త ప్రభుత్వం వచ్చాక అక్రమ తొలగింపులు, రాజకీయ వేధింపులు పెరిగాయని, వాటిని తక్షణం నిలుపుదల చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ నెల 5వ తేదీన సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏలూరులో కలెక్టర్ కార్యాలయం వద్ద కార్మికులతో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం టిడిపి వారిని ఇబ్బంది పెట్టిందనే పేరుతో నేడు టిడిపి ప్రభుత్వం కొద్దిమంది చిరుద్యోగులను ఇబ్బంది పెట్టడం సరికాదని, ఇద్దరికీ తేడా లేదని స్పష్టం అవుతోందని తెలిపారు. తమ ప్రతాపాన్ని ఆయా పార్టీల నాయకులపై చూపించుకోవాలని, ఓట్లు వేసిన సాధారణ ప్రజలపై కాదని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఎవరికి ఇష్టమైన పార్టీని వారు అభిమానించడం, ఓట్లు వేయడం రాజ్యాంగం ఇచ్చిన హక్కు అని, దాన్ని కాలరాయాలని ఎవరు చూసినా ప్రజాగ్రహానికి గురికాక తప్పదని, వైసిపి పరాభవం నుంచి టిడిపి ప్రభుత్వం వారు కూడా నేర్చుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే వందలాది మంది మధ్యాహ్న భోజన కార్మికులను, వెలుగు డిపార్ట్‌మెంట్లో పనిచేస్తున్న విఒఎలను, పట్టణాల్లో పనిచేసే ఆర్‌పిలను, కొన్నిచోట్ల అంగన్‌వాడీలను, ఆశాలను రాజకీయంగా వేధిస్తున్నారని, అక్రమంగా తొలగిస్తున్నారని తెలిపారు. తక్షణం అక్రమ తొలగింపులు ఆపాలని కోరుతూ సోమవారం ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. వారికి మద్దతుగా ఇతర రంగాల కార్మికులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

హాస్టల్‌కు ఫ్యాన్లు ఏర్పాటు

మంత్రి పార్థసారధికి బాలికలు, హాస్టల్ వార్డెన్ కృతజ్ఞతలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని ఎంప్లాయిస్ కాలనీలో ఉన్న శ్రీ మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి శనివారం సీలింగ్ ఫ్యాన్లు ఏర్పాటు చేయించారు. పుస్తకాల పంపిణీ సందర్భంగా శుక్రవారం రాష్ట్ర మంత్రి పార్థసారధి హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలికలు చెప్పిన సమస్యల్లో ప్రధానంగా ఫ్యాన్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గ్రహించిన మంత్రి పార్థసారథి తక్షణమే ఫ్యాన్లు అందించాలని కార్యాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. హాస్టల్ తనిఖీ చేసి 24 గంటలు గడవకముందే బాలికల కష్టాలు తీర్చేందుకు ఫ్యాన్లు అందించడంతో బాలికలు, హాస్టల్ వార్డెన్ మంత్రి పార్థసారధికి కృతజ్ఞతలు తెలిపారు.

వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ



నిడమర్రులో...

ప్రజాశక్తి - నిడమర్రు

కేరళలో వయనాడ్ జిల్లా ఇతర ప్రాంతాల్లో సర్వస్వం కోల్పోయిన వరద బాధితులకు సహకారం అందించాలని సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు కోరారు. నిడమర్రు మండలంలోని భువనపల్లి గ్రామంలో సిపిఎం నాయకులు రెండు బృందాలుగా ఏర్పడి విరాళాలు సేకరించారు. బోయినపల్లి షాపుల యజమానులు, దాతల నుంచి రూ.5,460 విరాళాలు సేకరించినట్లు సిపిఎం నాయకులు తెలిపారు. మరో బృందం రూ.3,640 మొత్తం రూ.9,100 సేకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గవర సత్యనారాయణ, వెలగలేటి మోహన, లావేటి సోంబాబు, కానూరు రాజు, కమిలి నాని పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ :కేరళ వరద బాధితుల సహాయార్థం నూజివీడు పట్టణంలో సిపిఎం నాయకులు విరాళాలు సేకరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.రాజు ఆధ్వర్యంలో నూజివీడు పట్టణంలో రూ.6,150 సేకరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నూజివీడు పట్టణ కార్యదర్శి హనుమాన్లు, సిపిఎం నాయకులు సోమనాద్రి, మరియదాసు, శ్రీను పాల్గొన్నారు.



నూజివీడులో...

6,70,355 క్యూసెక్కుల నీరు దిగువకు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు ఎగువన గోదావరి నీటిమట్టం క్రమ క్రమంగా తగ్గుముఖం పడుతుంది. శనివారం పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే నుంచి 6,70,355 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేశారు. స్పిల్ వే ఎగువన 31.050 మీటర్లు, స్పిల్ వే దిగువన 22.240 మీటర్లు నీటిమట్టం నమోదైనట్లు అధికారులు తెలిపారు. పోలవరంలో గోదావరి నీటిమట్టం 21.507 మీటర్లు నమోదైందని, 6,70, 980 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు ప్రవహిస్తున్నట్లు సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు. కడమ్మ స్లూయిజ్ వద్ద గేట్లు వరద నీటి నుంచి బయటపడడంతో ఏటిగట్టుకు కుడివైపున పంటపొలాల్లో ఉన్న వరద జలాలు వేగంగా గోదావరిలోకి ప్రవహిస్తున్నాయి.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్

ప్రజాశక్తి - చింతలపూడి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ సిహెచ్.మధుబాబు, ధర్మాజీగూడెంలోని సాయి జూనియర్, డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు ర్యాగింగ్, మాదకద్రవ్యాల నివారణ అంశం పై శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ కళాశాలల్లో ప్రస్తుతం ర్యాగింగ్ ఒక సమస్యగా మారిందన్నారు. విద్యార్థులు తోటివారితో స్నేహంతో మెలగాలని, వారికి సీనియర్ విద్యార్థులు వారి అనుభవాలను సూచిస్తూ వారి విద్యాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. తోటి విద్యార్థులతో దురుసుగా ప్రవర్తించడం, హేళన చేయటం వంటి చర్యలకు పాల్పడవద్దని, అటు వంటివి చర్యలకు పాల్పడితే తీవ్రంగా శిక్షించే విధంగా చట్టాలు ఉన్నాయన్నారు. అవి విద్యార్థి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపిస్తాయన్నారు. చింతలపూడి మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ మాట్లాడుతూ కళాశాలలో గంజాయిని కొందరు విద్యార్థులు ఉపయోగిస్తున్నారన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు తాగడం వల్ల అనారోగ్యం ఏర్పడటమే కాకుండా భవిష్యత్తుపై ప్రభావం చూపిస్తుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్య అభ్యసించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ క్రాంతి, చింతలపూడి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.నాగేశ్వరరావు ప్యానల్ లాయర్ శ్రీనివాస్, పట్నాల, పారా లీగల్ వాలంటీర్ అక్బర్ ఆలీ పాల్గొన్నారు.

టి.నరసాపురం : మొక్కలు నాటుతున్న రత్నప్రసాద్

గిరిజన చట్టాలపై అవగాహన అవసరం

టి.నరసాపురం :గిరిజన చట్టాలపై గిరిజనులందరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా లోక్ అదాలత్ కోర్టు జడ్జి కె.రత్నప్రసాద్ తెలిపారు. మండలంలోని మర్రిగూడెం గ్రామంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరం, గిరిజనుల హక్కుల రక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్య బృందం అనారోగ్య బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రస్తుతం ప్రబలుతున్న విషజ్వరాలు, అంటువ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అదేవిధంగా ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసి అక్కడ వసతి సదుపాయాలపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గిరిజన చట్టాలు వాటి పరిరక్షణపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి కోర్టు మేజిస్ట్రేట్ చిన్నం మధుబాబు, జీలుగుమిల్లి సిఐ క్రాంతికుమార్, ఎస్ఐ డి.దుర్గామహేశ్వరావు, చింతలపూడి బార్ ప్రెసిడెంట్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి దశ కీలకం : సిఐ రవికుమార్

ప్రజాశక్తి - భీమడోలు

విలువైన కాలం వినియోగంలో విద్యార్థి దశ కీలకమని, దానిని సద్వినియోగపరుచుకోవటంపై విద్యార్థుల ఉన్నత భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని భీమడోలు సిఐ బిబి.రవికుమార్ అన్నారు. మాంటిస్సోరి విద్యాసంస్థల ఆధ్వర్యంలో భీమడోలులో నిర్వహిస్తున్న శ్రీ మాధురి జూనియర్ కళాశాల, మాధురి ఒకేషనల్ కాలేజీ, రత్న డిగ్రీ కాలేజీల ఫ్రెషర్స్ డే, వార్షికోత్సవ కార్యక్రమాలను భీమడోలులో శనివారం నిర్వహించారు. మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత ప్రేమకుమార్ కార్యక్రమాలకు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా భీమడోలు సిఐతో పాటు భీమడోలు సొసైటీ మాజీ అధ్యక్షులు గన్ని నాగ గోపాలరావు హాజరయ్యారు. కార్యక్రమాలను కరస్పాండెంట్ కర్రి స్వాతి మాధురి పర్యవేక్షించారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం కొనసాగిన కార్యక్రమంలో భీమడోలు సిఐ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనువుగా విద్యార్థులు నేర్చుకునే అంశాలపై ప్రాధాన్యతలో మార్పులు వస్తున్నాయన్నారు. దీనిలో భాగంగా స్థానికంగా, విదేశాల్లో ఉన్నత స్థానాలు పొందేందుకు విద్యార్థులు తాము సాధారణంగా నేర్చుకునే భాషలకు అదనంగా వేరొక భాషను నేర్చుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఇదే క్రమంలో ప్రశ్నించే తత్వం అలవాడాలని సూచించారు. భీమడోలు సొసైటీ మాజీ అధ్యక్షులు గన్ని నాగగోపాలరావు మాట్లాడుతూ విద్యార్థులు తమ కుటుంబ సభ్యుల ఆశయాలకు అనుగుణంగా, ఉపాధ్యాయుల సహకారంతో విద్యను నేర్చుకొని ఉన్నత స్థానాలకు చేరాలని కోరారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రేమ కుమార్ మాట్లాడుతూ తమ విద్యాసంస్థల భీమడోలు శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ సంస్థగా జూనియర్ కాలేజీ, ఒకేషనల్ జూనియర్ కాలేజీ, ఆదికవి నన్నయ యూనివర్సిటీ అనుబంధ కాలేజీగా డిగ్రీ కళాశాలను నిర్వహిస్తున్నామన్నారు. అధికారిక స్టడీ సెంటర్లుగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ, ఓపెన్ స్కూలు, జూనియర్ కళాశాల, ఆంధ్ర యూనివర్సిటీలకు చెందిన వివిధ అంశాలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ప్రముఖులు భీమడోలు ఫైర్ ఆఫీసర్ నాగరాజు, మాజీ జెడ్‌పిటిసి కరణం పెద్దిరాజు, టిడిపి ప్రముఖులు యుగంధర్, విశ్రాంత ఉపాధ్యాయులు సుబ్బారావు, జనసేన నాయకులు పత్తి మదన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భీమడోలు జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవాని రంగా, సర్పంచి సునీత మాన్సింగ్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

సమగ్ర శిక్షా ఎఎస్ఎల్ఒ డాక్టర్ జి.రాధాకృష్ణ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన ఉండాలని, సహిత విద్య, ప్రత్యేక అవసరాలు గల పిల్లల విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సమగ్ర శిక్షా ఎఎస్ఎల్ఒ డాక్టర్ జి.రాధాకృష్ణ అన్నారు. మండల పరిధిలోని పాఠశాలలను సహిత విద్య, ప్రత్యేక అవసరాలు గల పిల్లల విద్య కో-ఆర్డినేటర్ బి.భాస్కరరావు, ఎఎంఒ ఆర్.రామారావు ఉన్నతాధికారుల ఆదేశానుసారం శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సంతృప్తిని వ్యక్త పరిచారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు కె.సర్వేశ్వరరావు, కె.ఆనందకుమార్ పాల్గొన్నారు.

ఆర్‌జియుకెటి అడ్మిషన్లకు రెండో విడత కౌన్సెలింగ్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం యుజి అడ్మిషన్లు-24కు సంబంధించిన రెండో విడత కౌన్సెలింగ్ ఎంపిక జాబితా అడ్మిషన్ కన్వీనర్, ప్రొఫెసర్ ఎస్.అమరేంద్ర, ఆర్‌కె వ్యాలీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎవిఎస్ఎస్.కుమార్‌స్వామి, ఆర్‌కెవి క్యాంపస్ ఆఫీసర్ డాక్టర్ పి.రవికుమార్, డీన్ విద్యావేత్తలు డాక్టర్ సిహెచ్.రత్నకుమారి సమక్షంలో ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లో శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటి దశలో జనరల్ కేటగిరీకి సంబంధించి 753 సీట్లకు ఎంపిక జాబితా సిద్ధం చేశారు. ఎంపిక జాబితా www.rgukt.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. ఆర్‌కె వ్యాలీ, ఒంగోలు క్యాంపస్‌లకు ఎంపికైనవారికి ఆర్‌కె వ్యాలీ క్యాంపస్‌లో అదేవిధంగా నూజివీడు, శ్రీకాకుళం క్యాంపస్‌లకు ఎంపికైన వారికి నూజివీడు క్యాంపస్‌లో ఈ నెల తొమ్మిదో తేదీన కౌన్సెలింగ్ జరుగుతుంది. వికలాంగులు, ఎన్‌సిసి, స్పోర్ట్స్ కోటాకు సంబంధించిన జాబితా వచ్చే వారంలో విడుదలవుతుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 19, 20 తేదీల్లో సంబంధిత క్యాంపస్‌లో రిపోర్ట్ చేయాలని, తరగతులు 21న ప్రారంభమవుతాయని డైరెక్టర్ తెలిపారు.

పుస్తకాలతో విద్యార్థుల్లో మేధాశక్తి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

విద్యార్థుల్లో మేధాశక్తి పెంపొందించేందుకు పుస్తకాలు ఎంతగానో దోహదపడతాయని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం ద్వారా విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో మేధాశక్తి పెంపొందించేందుకు పుస్తకాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దడంలో అధ్యాపకుల పాత్ర కీలకమన్నారు. దూరపు విద్యార్థుల సౌకర్యార్థం కళాశాలలోని ఓ గదిని హాస్టల్‌గా కేటాయించి, ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహంలో భోజన వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి మండలాధ్యక్షులు ఎస్.సాయి, పి.రాము, కళాశాల ప్రిన్సిపల్ సతీష్, నాయకులు ప్రసాద్, సాయి, మధు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎరువులు ఎంఆర్‌పి ధరలకు విక్రయించాలి

ప్రజాశక్తి - ముసునూరు


తనిఖీ చేస్తున్న మధుమోహన్

ఎరువులు, పురుగు మందులు, విత్తనాల డీలర్లు ఎంఆర్‌పి ధరలకు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ముసునూరు మండల వ్యవసాయాధికారి ఎస్.మధుమోహన్ సూచించారు. మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలోని శ్రీ మురళి ట్రేడర్స్ పురుగుమందుల షాపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లను, ఇన్వాయిస్ బిల్లు పుస్తకాలను ఆయన పరిశీలించారు. ప్రిన్సిపుల్ సర్టిఫికెట్ పది లీటర్లు బారా జైడ్ అమ్మకాలను నిలుపుదల చేశారు.

పారిశుధ్య పనుల పర్యవేక్షణ

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు నగర పారిశుధ్య విభాగం ప్రతిరోజు పర్యవేక్షణలో భాగంగా ఉదయం ఐదు గంటల నుంచి పలు పారిశుధ్య కార్మికుల మస్తర్ పాయింట్లను ఆకస్మిక తనిఖీ చేసినట్లు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా పలు డివిజన్లలో తిరిగి పారిశుధ్య పనులను పర్యవేక్షించి సిబ్బందికి తగు సూచనలు చేశారు.

దోమల నివారణ మందు పిచికారీ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

వీరమద్దిగూడెం, ముప్పినవారిగూడెం గ్రామాల్లో దోమల మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌యుఒవి.పెద్దిరాజు మాట్లాడుతూ దోమల మందు పిచికారీ చేయడంతో పాటు దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ రాజేశ్వరి, హెచ్‌పి వెంకాయమ్మ, ఎఎన్ఎంలు దివ్య, శంకురమ్మ, ఎంపిహెచ్ఎలు అన్నపరాజు, బాలాజీ, రవీంద్ర పాల్గొన్నారు.

ఏలూరు సిటీ : స్టాప్ డయేరియా క్యాంపెయిన్ కార్యక్రమంలో భాగంగా ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధులు రాకుండా మలేరియా విభాగం వారితో 20వ డివిజన్‌లోని దోమల నివారణకు చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నరసింహరావుపేట, గ్రాండ్ ఆర్య రోడ్డు, రైల్వే ట్రాక్ రోడ్, డాక్టర్ జగన్మోహన్‌రావువీధి, తదితర ప్రాంతాల్లో దోమల లార్వా నిర్మూలనలకు స్ప్రేయింగ్, మురుగు కాలువ కల్వర్టు కింద ఫాగింగ్, ఖాళీ స్థలాల్లో ఉన్న నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎంవివిఎస్.నాగేశ్వరరావు, మలేరియా ఇన్‌స్పెక్టర్ దత్తి వేణుగోపాల్ స్వామి, మలేరియా సూపర్‌వైజర్ డి.దుర్గారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.ఏడుకొండలు, ఆరోగ్య కార్యదర్శి, ఆశా కార్యకర్తలు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

స్కౌట్స్, గైడ్స్ ఓరియంటేషన్ తరగతులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక ఈదర సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూల్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు. డిఇఒ ఎస్.అబ్రహం ముఖ్యఅతిథిగా హాజరై 150 మంది పాఠశాలల ఉపాధ్యాయులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆవశ్యకత గురించి తెలియజేశారు. విద్యార్థుల్లో స్వీయ క్రమశిక్షణ, విద్యార్థుల్లో నిబిడీకృతమైన వివిధ నైపుణ్యాలు, బాధ్యత, దేశభక్తి తదితర వాటిని పెంపొందించి, ఒక సేవా నిరతి కలిగిన పౌరునిగా మార్చవచ్చని, స్కౌట్ అండ్ గైడ్స్ వల్ల పోటీ పరీక్షల్లో, ఉద్యోగాల్లో రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. జిల్లాలోని ప్రతి పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు ప్రారంభించాలని, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ ఎవిఎస్ఎన్.భాస్కర్‌కుమార్ మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపాధ్యాయులకు అవసరమైన బిగినర్స్, బేసిక్, అడ్వాన్స్‌డ్ తదితర ట్రైనింగ్ వివరాలు, విద్యార్థులకు శిక్షణ కావాల్సిన కోర్సులు ప్రథమ, ద్వితీయ, తృతీయ సోపానం తదితర కోర్సుల గురించి వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.కుటుంబరావు, ఇతర పాఠశాలల నుంచి స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రైనింగ్ పొందిన ఉపాధ్యాయులు, ట్రైనింగ్ పొందాల్సిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

గుర్తు తెలీని రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

గుర్తు తెలీని రైలు ఢీకొని గుర్తు తెలీని వ్యక్తి మృతి చెందిన ఘటన దెందులూరు రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే ఎస్ఐ సైమన్ తెలిపిన వివరాల ప్రకారం... దెందులూరు మండలంలోని అలుగులగూడెం రైల్వే గేటు సమీపంలో గుర్తు తెలీని రైలు ఢీకొని గుర్తు తెలీని వ్యక్తి మృతి చెందాడు. అతని వయసు 25 నుంచి 30 సంవత్సరాలు ఉంటుందని రైల్వే పోలీసుల అంచనా వేస్తున్నారు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. రైల్వే ఎస్ఐ సైమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చింతలపూడి

కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని కాపు సంఘ పట్టణ అధ్యక్షులు తూము విజయకుమార్ అన్నారు. చింతలపూడి ఘంటవారి వీధికి చెందిన సుంకర జ్యోతి కుమార్తె యామినికి ఎంసెట్‌లో ఏడు వేల ర్యాంక్ వచ్చింది. ఆ విద్యార్థినికి ఎఎన్ఐటిఎస్ ఇంజినీరింగ్ కాలేజీలో సీటు వచ్చింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంజినీరింగ్ చదువుకోలేని పరిస్థితి. ఈ విషయం తెలిసిన కాపు సంఘం, ఇతరులు ఆ విద్యార్థినికి ఆర్థిక సాయం అందించారు. శ్రీకృష్ణ దేవరాయ చింతలపూడి పట్టణ కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘంటా నాగభూషణం, తోట ఆదినారాయణ సహకారంతో కాపు సంఘ పట్టణ అధ్యక్షులు తూము విజయకుమార్ సమక్షంలో రూ.41 వేలు యామినికి అందించారు. భవిష్యతులో కూడా ఆమె ఇంజినీరింగ్ పూర్తి చేయడానికి తమ వంతు సహకారాన్ని అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్యాల గణేష్, కొత్తపూడి శేషగిరిరావు, పసుపులేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలు అందించాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులకు సాగు రుణాలు అందించాలని మండల ఎడిఎ జి.వెంకటమణి బ్యాంకు అధికారులను కోరారు. ముదినేపల్లిలోని ఎస్‌బిఐ, కెడిసిసి బ్యాంకు అధికారులను ఆమె రైతులతో శనివారం కలిసి మాట్లాడారు. కౌలు రైతులకు తోడ్పాటునందించాలన్నారు. కౌలు రైతులకు రుణాలు అందించి సాగుకు తోడ్పాటు అందించాలని బ్యాంకు అధికారులను వెంకటమణి కోరారు. ఆమెతో పాటు మండల వ్యవసాయ అధికారి బి.వేణుమాధవ్ ఉన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

ప్రజాశక్తి - చింతలపూడి

ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని చింతలపూడి సిఐ సుధాకర్ చెప్పారు. జిబిజి రోడ్డు సెంటర్‌లో వాహనదారులకు సిఐ సుధాకర్, ఎస్ఐ కుటుంబరావు పలు సూచనలు చేశారు. వాహనదారులు రోడ్డు నియమ నిబంధనలు పాటించాలన్నారు.

ఏలూరు స్పోర్ట్స్ : సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే జరిమానాలు విధిస్తామని పెదపాడు ఎస్ఐ శుభశేఖర్ తెలిపారు. పెదపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని కలపర్రు టోల్ ప్లాజా సమీపంలో శనివారం సాయంత్రం ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా జాతీయ రహదారిలో ప్రయాణించే వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడిపేవారికి విధించే జరిమానా వివరించారు. ద్విచక్రవాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

గోనెసంచుల రవాణా ఛార్జిల కోసం టెండర్

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ జిల్లా సివిల్ సప్లైస్ మేనేజర్ కార్యాలయానికి సంబంధించి కొత్త, పాత గోనెసంచుల రవాణాకు సంబంధించి ఎగుమతి, దిగుమతి ఛార్జీల కోసం టెండర్ ప్రకటన జారీ చేసినట్లు జెసి పి.ధాత్రిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన సంస్థలు, వ్యక్తుల నుంచి సీల్డు టెండర్లు రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ వారిచే కోరుతున్నామన్నారు. టెండర్‌దారులకు టెండర్ షెడ్యూల్, షరతులు, విధివిధానాలు తదితర వివరాలను జిల్లా అధికారిక వెబ్‌సైట్ https://eluru.ap.gov.in/notice_category/tendersలో పొందొచ్చని జెసి తెలిపారు.

వసుధ ఫౌండేషన్ ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

మండలంలోని పంగిడిగూడెం గ్రామానికి చెందిన సూర్యచంద్రం మెదడు సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న వసుధ ఫౌండేషన్ సూర్యచంద్రం కుటుంబ సభ్యులకు రూ.20 వేలు ఆర్థిక సహాయం చెక్కు రూపంలో అందించారు. సూర్యచంద్రం కుటుంబ సభ్యులు వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ జంగారెడ్డిగూడెం సభ్యులు చోడే ఫణి చంద్రశేఖర్, కొండపల్లి పండు, కొండేపాటి రామకృష్ణ పాల్గొన్నారు.

అచ్యుతాపురం-శ్రీరంగపురం రోడ్డు నిర్మాణానికి నిధులు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని అచ్యుతాపురం-శ్రీరంగపురం రహదారికి మోక్షం లభించింది. కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ నుంచి ఈ రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించారు. సెప్టెంబర్ నుంచి రహదారి పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

విద్యార్థులు ప్రలోభాలకు గురి కావొద్దు

న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి తేజస్వి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మాట్లాడుతున్న న్యాయమూర్తి తేజస్వి

బూసరాజుపల్లి గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాల, ఉన్నత పాఠశాలలో జంగారెడ్డిగూడెం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కెఎస్ఆర్.తేజస్వి, జూనియర్ సివిల్ న్యాయమూర్తి అశోక్ శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి తేజస్వి మాట్లాడుతూ సమాజంలో మహిళల పట్ల జరుగుతున్న దాడుల గురించి విద్యార్థినులు చదువుతున్న కళాశాలలో ఎదుర్కొంటున్న ఈవ్‌టీజింగ్, ర్యాంకింగ్‌ల గురించి వివరించారు. మహిళలకు ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా విద్యార్థులు ఏ విధమైన ప్రలోభాలకు గురికాకుండా ఉండాలని సూచించారు. అనంతరం కళాశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ఉద్దండం ఏసుబాబు, బొడ్డు శ్రీనివాసరావు, ఎస్ఐ వెంకన్న, బార్ అసోసియేషన్ సభ్యులు, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వరద బాధితులకు దుస్తులు, దుప్పట్లు అందజేత

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

పెదవాగు ప్రాజెక్టు, భారీ వర్షాల వల్ల నష్టపోయిన మండలంలోని వరద ప్రభావిత కుటుంబాలకు పలువురు దాతల ముందుకు వచ్చి సహకరించి ఆదుకోవాలని సిపిఐ నాయకులు కోరారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్, రాష్ట్ర మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవాని, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి మునీర్, జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి మన్నవ యామిని, స్థానిక నాయకులతో కలిసి అల్లూరి నగర్, జీడిగింపు, ఉదయ నగర్ తదితర గ్రామాల్లోని బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి దుస్తులు, దుప్పట్లు అందించారు. విజయవాడకు చెందిన పాపులర్ షూ మార్ట్ సంస్థ, ఎల్రోనిక్స్ సిస్టం ప్రయివేట్ లిమిటెడ్ దాతల సహకారంతో రూ.ఐదు లక్షల విలువైన వస్త్రాలను అందించారు

వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

స్థానిక సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నాయకులు మాట్లాడారు. వరద బాధితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. ఉపాధి హామీతో రైతులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గ కార్యదర్శి కారం దారయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు, మండల కార్యదర్శి బాడిస రాము, రామవరం సర్పంచి పిట్ట ప్రసాద్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పిట్టా వీరయ్య పాల్గొన్నారు.

పెదవాగు ప్రాజెక్టు వలన సర్వం కోల్పోయిన కమ్మరిగూడెం, అల్లూరి నగర్ గ్రామాల్లో వరద బాధితులకు టిడిపి కూటమి ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెంలోని సూర్య, విద్యావికాస్ విద్యాసంస్థలు, ప్రగతి స్కూల్, ఇండియన్ డిజిటల్ స్కూల్ కిడ్స్ కాన్వెంట్ విద్యాసంస్థల వారు వంట సామగ్రి పంపిణీ చేశారు. వేలేరుపాడు వరద ముంపు బాధితులకు జనసేన, టిడిపి నాయకులు కమ్మరిగూడెం గ్రామాల్లో గిరిజనులకు, చిన్నారులకు, వృద్ధులకు దుప్పట్లు, దుస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమన రవికుమార్ పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లోని గ్రామాలలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని సౌకర్యాలని ఏర్పాటు చేయాలని సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో ఎంపిడిఒ శ్రీహరికి శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు సిరికొండ రామారావు, గడ్డల ముత్యాలరావు, పార్టీ మండల కార్యదర్శ సోయం చంద్రరావు మాట్లాడుతూ వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

నరసింహరావుపాలెంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని నరసింహరావుపాలెం గ్రామ పంచాయతీలో విష జ్వరాలు బారిన పడి అనారోగ్యానికి గురైన ప్రజలకు వైద్య సేవల అందించేందుకు కట్ట నాగ దుర్గారావు (దుర్గ), మందపాటి విద్యాధర్ రెడ్డి చొరవతో శనివారం ప్రభుత్వ వైద్యాధికారి దుర్గాప్రసాద్ శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోపాలకృష్ణ, విఆర్ఒ వినోద్, ఎంపిహెచ్ఇఒ శ్రీధర్, ఎంఎల్‌హెచ్‌పి శాంతి, ఎఎన్ఎం శైలజ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేసే సంస్థలను ప్రోత్సహిస్తా

ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు నగరంలోని ఆరో డివిజన్‌లో మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి హాజరయ్యారు. నగరంలోని ఎంఎస్ఎన్ కంపెనీ వారు బాలాజీ నగర్ చాటపర్రు రోడ్డులో మానవతా సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసే సంస్థలను ప్రోత్సహిస్తామని తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రతి సేవా కార్యక్రమానికి తాను వెళ్లి ప్రోత్సహిస్తున్నానని తెలిపారు. ప్రతిఒక్కరూ సంస్థ ఆశయాల కోసం ప్రజా ప్రయోజనాల కోసం పాటుపడాల్సిన అవసరం ఉందన్నారు. మానవతా స్వచ్ఛంద సంస్థ వెంకన్న చెరువు వద్ద శ్మశానానికి షెడ్డు వేస్తానని తెలిపారని, దీనికి సంబంధించి మున్సిపాలిటీ నుంచి అన్ని అనుమతులు వచ్చేలా కృషి చేస్తానని చెప్పారు. ఎవరైనా ప్రజల కోసం, నగర అభివృద్ధి కోసం సేవ చేసేందుకు ముందుకు వస్తే తాను స్వాగతిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఆరో డివిజన్ ఇన్‌ఛార్జి మాకల రమేష్‌తో పాటు టిడిపి నాయకులు, మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఎంసి ఎన్నికలు సక్రమంగా నిర్వహించాలి

జిల్లా సమగ్ర శిక్షా ఎఎస్ఎల్ఒ డాక్టర్ రాధాకృష్ణ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

పాఠశాలల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసి)ఎన్నికల నిర్వహణను ప్రధానోపాధ్యాయులు నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని ఏలూరు జిల్లా సమగ్ర శిక్షా ఎఎస్ఎల్ఒ డాక్టర్ రాధాకృష్ణ అన్నారు. ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికల ప్రక్రియపై పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఒరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు కె.సర్వేశ్వరావు, కె.ఆనంద్‌కుమార్, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

8న పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు

నూజివీడు టౌన్ : పట్టణంలోని ఎస్ఆర్ఆర్ జెడ్‌పి బాలుర హైస్కూల్‌లో ఈ నెల ఎనిమిదో తేదీన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ప్రధానోఉపాధ్యాయులు డాక్టర్ భాగవతుల హేమలత తెలిపారు. కమిటీ ప్రధాన లక్ష్యం పాఠశాల అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. ఒక్కొక్క తరగతికి ముగ్గురు సభ్యుల చొప్పున ఎన్నుకుంటారని, ఈ ఎన్నికల నిమిత్తం ఓటరు జాబితాను విడుదల చేశామని, ఏదైనా అభ్యంతరాలు ఉంటే ఐదో తేదీ లోపు సరి చేసుకోవచ్చని చెప్పారు.

పలుచోట్ల తల్లిపాల వారోత్సవాలు

ఉంగుటూరు : తల్లిపాల వారోత్సవాల అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

బిడ్డకు తల్లి పాలు సంపూర్ణ ఆహారమని ఐసిడిఎస్ భీమడోలు సిడిపిఒ కె .విజయలక్ష్మి అన్నారు. నల్లవాడు శివారు రామచంద్రపురం గ్రామంలో తల్లి పాల వారోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి పాలలో బిడ్డకు అవసరమైన అన్ని పోషకాలు ఉంటాయని, వ్యాధి నిరోధక శక్తి కలుగుతుందని చెప్పారు. బిడ్డకు మొదటి ఆరు నెలలు తల్లి పాలే సంపూర్ణ ఆహారమన్నారు. ఆరు నెలలు దాటిన తరువాత తల్లి పాలతోపాటు అనుబంధ ఆహారం కూడా ఇస్తారని తెలిపారు. తల్లిపాలు శిశువును న్యుమోనియా, అతిసార వంటి ప్రమాదకరమైన వ్యాధుల నుంచి కాపాడతాయన్నారు. పిల్లల మేధస్సును మెరుగుపరచడంలో తల్లి పాలు సహాయపడతాయని వివారించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో తల్లి పాల వారోత్సవాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం అన్నప్రాసరణ, శ్రీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేబ్రోలు సెక్టార్ సూపర్‌వైజర్ శారదమణి, అంగన్వాడీ కార్యకర్తలు పి.సుజాత, జె.లక్ష్మీకాంతం, సత్యవతి, ఝాన్సీ, ఆయాలు శృతి, తల్లులు, ఆరోగ్య ఉప కేంద్రం ఆరోగ్య వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : అప్పుడే పుట్టిన పిల్లలకు తల్లి పాలు శ్రేష్టమని జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిని బి.గాయత్రి అన్నారు. జీలుగుమిల్లి సెక్టార్ పరిధిలోని బర్రింకలపాడు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఆరు నెలల వరకు తల్లి పాలను ఇవ్వాలన్నారు. అనంతరం పలువురు మహిళలకు శ్రీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ, కార్యకర్తలు యు.నాగమణి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

చింతలపూడి : బిడ్డకు తల్లి పాలు సంపూర్ణ ఆరోగ్యమని ఐసిడిఎస్ సిడిపిఒ పి.మాధవి అన్నారు. చింతలపూడి సమ్మేటవారిగూడెం గ్రామంలో తల్లిపాల వారోత్సవ కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి పాలలో బిడ్డకు అవసరమైన అన్ని పోషకాలు ఉంటాయన్నారు. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బిడ్డకు మొదటి ఆరు నెలలు తల్లి పాలే పట్టించాలన్నారు. ఆరు నెలలు దాటిన తరువాత తల్లి పాలతో పాటు అనుబంధ ఆహారం కూడా ఇస్తారని తెలిపారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో తల్లి పాల వారోత్సవాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

ముసునూరు : బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు ఇచ్చినట్లయితే ఆరోగ్యకరంగా ఉంటారని అంగన్వాడీ ఉపాధ్యాయులు మేరీసులోచన, విద్యావతి అన్నారు. ముసునూరు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.

పోలవరం : తల్లిపాల ప్రాముఖ్యత గురించి ప్రతి బాలింతకు గర్భిణీలకు అంగన్వాడీలు విధిగా అవగాహన కల్పించాలని సిడిపిఒ స్వర్ణకుమారి అంగన్వాడీలకు సూచించారు. శనివారం పోలవరం వెలుగు కార్యాలయంలో అంగన్వాడీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఆగిరిపల్లి : ఈదర సెక్టార్ పరిధిలోని ఈదర గ్రామంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నూజివీడు ఐసిడిఎస్ సిడిపివో ఎస్వై నూరాని మాట్లాడారు.

ముదినేపల్లి : తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న అన్నారు. తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని అల్లూరు సచివాలయం పరిధిలోని ములకలపల్లి గ్రామంలో తల్లులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం

రాష్ట్ర మాజీ మంత్రి పేర్ని నాని

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తుందని రాష్ట్ర మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. నూజివీడు పట్టణంలోని సబ్ జైలులో వైసిపి నాయకులు, సానుభూతిపరులు ఉండడంతో వారిని శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పాలన ప్రారంభమై 60 రోజులు గడుస్తున్నప్పటికీ రాష్ట్ర అభివృద్ధి, సంపద సృష్టిపై దృష్టి సారించలేదన్నారు. ఆయనతో పాటు పామర్రు మాజీ ఎంఎల్ఎ కైలే అనిల్ కుమార్, వైసిపి నాయకులు, అభిమానులు ఉన్నారు.

నకిలీ రిజిస్ట్రేషన్‌పై దర్యాప్తు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణ పరిధిలో గొడుగువారిగూడెం ప్రాంతంలో ఓ భూమికి సంబంధించి అధికారుల ఫోర్జరీ సంతకంతో నకిలీ డాక్యుమెంట్స్ తయారు చేసినట్లు ఫిర్యాదు వచ్చిందని పట్టణ సిఐ మూర్తి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం...ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. మొత్తం 25.46 ఎకరాల భూమికి సంబంధించి నకిలీ డాక్యుమెంట్స్‌పై దర్యాప్తు కొనసాగుతుందన్నారు.

ఎంఆర్‌పిఎస్ నాయకుల హర్షం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఎస్‌సి వర్గీకరణపై హర్షం వ్యక్తం చేస్తూ టిడిపి నూజివీడు నియోజకవర్గ కార్యాలయంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు కేక్ చేసి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి నాయకులకు, ప్రభుత్వానికి, ప్రధానిమంత్రి నరేంద్రమోడీకి రుణపడి ఉంటామని చెప్పారు. ఇంతటి చారిత్రక తీర్పును ఇచ్చిన సుప్రీంకోర్టు ఏడుగురు న్యాయమూర్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం నుంచి ఎంతో సహాయ సహకారం అందించిన రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథికి రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, టిడిపి నూజివీడు పట్టణ ప్రధాన కార్యదర్శి పల్లి నాగరాజు, ఎంఎస్ఎఫ్ నూజివీడు నియోజకవర్గ అధ్యక్షులు వేంపటి వెంకటేశ్వరరావు, ముళ్లపూడి రామారావు, తుమ్మలపల్లి అశోక్, బొడ్డు రాజు, కలపాల విలియమ్స్, దుబ్బాక దేవరాజు, బొడ్డు రాజేష్, పులపాక చంటి పాల్గొన్నారు.

'కార్యకర్తలకు అండగా వైసిపి'

ప్రజాశక్తి - చింతలపూడి

కార్యకర్తలకు వైసిపి ఎప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు అన్నారు. మండలంలోని అల్లిపల్లి గ్రామంలో వైసిపి కార్యకర్త బుడేటి ఆనంద్‌కుమార్ తల్లి అంత్యక్రియలకు ఆయన హాజరై సంతాపం తెలిపారు. అనంతరం సీతానగరం గ్రామంలో ఇటీవల మృతి చెందిన కనుమూరి చంద్రశేఖర్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సింగిరెడ్డి భరత్‌రెడ్డి, ఎంపిటిసి సభ్యులు కలకొండ రాంబాబు, కోటగిరి మురళీ, నరేంద్ర రాజు, శివ పాల్గొన్నారు.

CHANGE OF NAME

Gadugoyyala Subbalakshmi, W/o Subbanna, D.No.12-58-6, Housing Board Colony, Tanuku, Tanuku Mandal, W.G.Dist. I have changed my name from **Gadugoyyila Subbalakshmi (Old Name)** to **Gadugoyyala Subbalakshmi (New Name)** Now onwards use my new for all further Transactions.

CHANGE OF NAME

Gadugoyyala Subbanna, S/o Vigneswaradu, D.No.12-58-6, Housing Board Colony, Tanuku, Tanuku Mandal, W.G.Dist. I have changed my name from **Gadugoyyila Subbanna (Old Name)** to **Gadugoyyala Subbanna (New Name)** Now onwards use my new for all further Transactions.

మహారాజశ్రీ కొవ్వూరు Ist Addl. జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. 8/2023

Between:

వాది: శ్రీమతి వింటి దుర్గాదేవి, W/o. లేటు వెంకటేష్, హిందూ, వయస్సు 25, స్త్రీ, పోషణ, డో.నెం. 2-41, భీమోలు, Now since W/o. Tota Srinu, సరిపల్లె, కొయ్యలగూడెం మండలం, KJCJC.

Vs

శ్రీవింటి పేర్రాజు వెంకటరత్నం, వగైరాలు

...ప్రతివాదులు

4వ ప్రతివాది శ్రీమతి తెన్నీటి దుర్గ, W/o. దీక్షితులు, హిందూ, వయస్సు 29 సం॥లు, స్త్రీ, హౌస్ వైఫ్, కన్నాపురం రోడ్డు, కొయ్యలగూడెం, కొయ్యలగూడెం మండలం, JRG JCJC.

పై నెంబరు దావాలో 4వ ప్రతివాదికి కోర్టు ద్వారా దావా సమన్లు, రిజిస్టర్ పోస్టు ద్వారాను పంపించినన్ను అమలు జరుగనందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం యీ ప్రకటన వేయడమైనది. యీ నెంబరులో 4వ ప్రతివాది అయిన శ్రీమతి తెన్నీటి దుర్గ, W/o. దీక్షితులు, కొయ్యలగూడెం అనువారు ది. 12-8-2024వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు పై కోర్టు వారు పిలిపించే టైముకు స్వయంగా గానీ హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలియపరచుకొనవలెను. లేనియెడల Ex-party చేసి పరోక్షమున తీర్మానించడమగును.

వాయిదా తేది: 12-8-2024

CH.NAGA KUMAR
Advocate, Kovvur
Cell: 9440985149

సర్టిఫికేట్ పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం టౌన్, మర్రెళ్ళవారి రోడ్, డోర్‌నెం.24-4-6కు చెందిన తోట వెంకటేశ్వరరావు S/o.రమణయ్య (లేటు) అను నా యొక్క ఒరిజినల్ సర్టిఫికెట్స్ పోయినది. సర్టిఫికెట్ నెంబర్ : AP6/ME/087/19 Dated 05-02-2020 Issued By MPEDA SRO, Bhimavaram ది. 06.07.2024 తేదీన మా ఇంటి వద్ద నుండి భీమవరం ఓల్డ్ బస్టాండ్‌కి సర్టిఫికేట్ జిరాక్స్ తీయించు నిమిత్తం నా యొక్క మోటరు సైకిల్ పై ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకు వెళ్లుచుండగా మార్గం మధ్యలో పడిపోయినవి. దొరికిన వారు ఈ క్రింద అడ్రస్‌కు తెలియజేయగలరు.

THE MARINE PRODUCTS EXPORT DEVELOPMENT AUTHORITY
Sub Regional Division, 2-1-15, 2nd Floor, GRK Complex, Opp. to BPCL Bunk, J. P. Road, BHIMAVARAM-534 202, W. G. Dt., A.P

పాస్‌పోర్టు పోయినది

సూరెడ్డి లక్ష్మణకుమార్ తండ్రి: సూరెడ్డి ఎర్రిబాబు అను నేను నాయొక్క పాస్‌పోర్టు పడిపోయినది. ఇంటి నుండి జిరాక్స్ సెంటర్‌కు వెళుతుండగా నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. పాస్‌పోర్టు నెం. G6449930 గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికినయెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

సూరెడ్డి లక్ష్మణకుమార్
తండ్రి: ఎర్రిబాబు
డోర్ నెం. 2-84,
కామాక్షమ్మ టెంపుల్, పెనుగొండ,
పెనుగొండ మండలం, ప.గో.జిల్లా
పిన్: 534320
సెల్: 93468 22743

పాస్‌పోర్టు పోయినది

ప॥గో॥జిల్లా, నరసాపురం మండలం, బియ్యపుతిప్ప గ్రామమునకు చెందిన ఓడుగు శ్రీనివాస్, తండ్రి: నరసింహస్వామి అయిన నాయొక్క పాస్‌పోర్టు పోయినది. నాయొక్క పాస్‌పోర్టు నంబర్: 2600636 గల పాస్‌పోర్టు ది.25-07-2024వ తేదీన నరసాపురంలో జిరాక్స్ తీయించుకొని నరసాపురం నుండి బియ్యపుతిప్ప వెలుతుండగా మార్గ మధ్యలో నాయొక్క పాస్‌పోర్టు పడిపోయింది. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

ఓడుగు శ్రీనివాస్
తండ్రి: నరసింహస్వామి
బియ్యపుతిప్ప
నరసాపురం మండలం, ప.గో.జిల్లా
పిన్: 534275
సెల్: 97056 86308